విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

టోల్ ప్లాజా వసూళ్లపై మండిపడుతున్న ప్రజలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండలం అన్నం పల్లి టోల్ ప్లాజా వద్ద ఇంకా రోడ్డు పనులు పూర్తికాకుండానే టోల్ గేట్లు ఓపెన్ చేసి డబ్బులు వసూలు ప్రారంభించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కత్తిపూడి నుండి ఒంగోలు వరకు జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఎదురులంక నుండి అమలాపురం వరకు ఇంకా నిర్మాణ పనులు పూర్తవకుండానే టోల్ ప్లాజా వద్ద డబ్బులు వసూలు చేయడం తగదన్నారు.

వైరు దొంగలను వదిలిపెట్టేది లేదు

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి నియోజకవర్గంలో వ్యవసాయ పొలాల బోర్లు వైర్లు కట్ చేసి వాటిలో ఉన్న విలువైన రాగి వైరు దొంగలు ఎత్తుకపోవడం పరిపాటిగా మారింది. ఈ సందర్భంగా శనివారం ఎస్ ఐ అప్పారావును కలిసిన విశాలాంధ్ర విలేకరితో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో రాగి వైరు దొంగలను వదిలిపెట్టేది లేదన్నారు. ఈ దొంగతనంతో ఎవరెవరికి సంబంధం ఉందో వారందరిపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ అప్పారావు చెప్పారు. కొంతమంది తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ ఇటువంటి దొంగతనాలకు పాల్పడే, ప్రోత్సహించే వారిని వదిలిపెట్టేది లేదని ఎవరు ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని ఎస్ఐ అప్పారావు ఖరాకండిగా చెప్పారు.బోర్ల వైర్లు దొంగిలించకుండా చర్యలు చేపడతామని ఎస్సై చెప్పారు.

న్యాయశాస్త్రమంటే మక్కువ

విశాలాంధ్ర - నిడదవోలు : చదువుకుతగ్గ ఉద్యోగం దొరికితే చాలు అంతకుమించి ఏమి అక్కర్లేదు అనుకుంటారు కొందరు. ఓయన్జీసి లో ఉన్నత ఉద్యోగం చేస్తున్నప్పటికీ చదువు మీదవున్న మక్కువతో డాక్టరేట్ సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు తాడిమళ్లకు చెందిన బయ్యే లక్ష్మణరావు.ఆయన తెలిపిన వివరాలు ప్రకారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తాడిమళ్ల కు చెందిన బయ్యే మల్లమ్మ ,సుబ్బారావు దంపతుల కుమారుడు బయ్యే లక్ష్మణరావు. తల్లిదండ్రులతో పాటుగా విద్యార్థి దశలో సెలవు దినాల్లో వ్యవసాయ కూలీగా పని చేస్తూ ఎమ్ యస్ సి టెక్నాలజీని పూర్తి చేసారు. న్యాయశాస్రం పై ఉన్న మక్కువతో ఎల్.ఎల్.బి చదివారు.అనంతరం ఓయన్జీసి లో ఉద్యోగం రావడంతో బాధ్యతలు చేపట్టారు.ఒకప్రక్క ఉద్యోగ బాధ్యతలు మరో ప్రక్క కుటుంబ బాధ్యతలు ఎక్కువ కావడంతో చదువుకు కొంత విరామం ఇచ్చినా న్యాయ శాస్త్రం పై ఆయనకున్న మక్కువ తగ్గ లేదు.అనంతరం ఎగ్జిక్యూటివ్ కోటలో అధిక ఫీజులను చెల్లించి న్యాయ శాస్త్రంలో దూరవిద్య ద్వార మాస్టర్ డిగ్రీ యల్.యల్.యమ్ ను పూర్తి చేశారు.ఓయన్జీసి లో 31 సంవత్సరాల పాటు సేవలందించి జనరల్ మేనేజరుగా పదవీవిరమణ చేసిన లక్ష్మణరావు వ్యవసాయ రంగం లో మహిళ కార్మికుల పాత్ర అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు గాను ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీ డి.ప్రసాద్ రెడ్డి,పరిశోధన సలహాదారు డి.సూర్యప్రకాశ రావు చేతులమీదుగా లక్ష్మణరావు డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో సెలవు దినాల్లో కూలీగా పని చేసిన అనుభవం ఈ పరిశోధనకు ఎంతగానో సహకరించిందన్నారు.న్యాయ శాస్త్రం మీద ఉన్న మక్కువతోనే ఈ డాక్టరేట్ ను సాధించానని తెలిపారు. తాడిమళ్ళ గ్రామ సర్పంచ్ గా సేవలందిస్తున్న భార్య రాధారాణి ఎల్.ఎల్.బి పూర్తీ చేసి న్యాయవాదిగా పనిచేస్తుండగా,కుమారుడు తేజ నారాయణ సైతం న్యాయవిద్య అభ్యసిస్తున్నారు.కుమార్తె ఐశ్వర్య ఏయూలోనే బిటెక్ సివిల్ ఇంజనీరింగ్ చదువుతోందని బయ్యే లక్ష్మణరావు విశాలాంధ్ర కు తెలిపారు.

అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడిగా అంజిబాబు

విశాలాంధ్ర - పిఠాపురం : స్థానిక శ్రీ సూర్య రాయ విద్యానంద గ్రంథాలయంలో ఏఐఎఫ్‌టియు పిఠాపురం డివిజన్ కమిటీ సమావేశం మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐఎఫ్టియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్, పిడిఎస్యు(వి) రాష్ట్ర కన్వీనర్ కడితే సతీష్, పారిశుధ్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ బి. ఏసుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్. సతీష్ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న అన్ని రంగాల కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్మిక వర్గ హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. పిడిఎస్‌యు రాష్ట్ర కన్వీనర్ కడితి సతీష్ మాట్లాడుతూ పాలకవర్గాలు, విద్యా వైద్యాన్ని ప్రైవేటుపరం చేస్తూ ప్రజలపై మరింత భారం మోపుతున్నారన్నారు. అనంతరం డివిజన్ కమిటీ సమావేశంలో పిఠాపురంలో ఉన్న కార్మిక సమస్యలపై చర్చించి నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఏఐఎఫ్టీయూ పిఠాపురం డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా డి. నారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కుంచే అంజిబాబును, కమిటీ సభ్యులుగా మొగలి కనకమహాలక్ష్మి, యువరాజు పాలపర్తి రాయుడు, తోట చంద్రరావు, పిల్లా ఏసుబాబును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, పారిశుధ్య కార్మికులు రిక్షా యూనియన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. ఏకగ్రీవంగా డివిజన్ సభ ఎన్నుకుంది. అనంతరం మార్చి 21 రాజమండ్రిలో జరుగు మోతా వెంకటరావు వర్ధంతి సభను జయప్రదం చేయాలని కరపత్ర ఆవిష్కరణ జరిగింది.

ప్రజా సంపదను కాపాడుకుందాం

విశాలాంధ్ర-కొవ్వూరు : ఎస్బిఐ, ఎల్ఐసి లో ఉన్న ప్రజా సంపదను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకుందామని కొవ్వూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ, ఇన్‌చార్జి, రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ జిల్లా మహిళా అధ్యక్షురాలు అరిగెల అరుణ్ కుమారి అన్నారు. ఎల్ఐసి ఆఫీస్ వద్ద స్టేట్ బ్యాంకు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎపిసిసి ఆదేశాలమేరకు అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ పిలుపు మేరకు, కొవ్వూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్బిఐ, ఎల్ఐసి లో ఉన్న ప్రజా సంపదను, మోడీ ప్రభుత్వం అదానీ సంస్థలో బలవంతపు పెట్టుబడులు పెట్టడాన్ని నిరసనగా కొవ్వూరు ఎల్ఐసి కార్యాలయం దగ్గర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. కొవ్వూరు కాంగ్రెస్ పార్టీ నియోజకర్గ ఇన్‌చార్జి అరిగెల అరుణ కుమారి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎల్ఐసి ద్వారా నష్టపోయిన వారికి వెంటనే తగు న్యాయం చేసేవరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈనెల 11న చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని,30న ముసుగు తొలగించాలి అనే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోదదాసి మార్టిన్ లూథర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో బిజెపి చిత్తు చిత్తు గా ఓడి పోవడం ఖాయం అన్నారు. డా.వై.ఏ.వాడయార్, ఆకుల భాగ్య లక్ష్మి, బాలేపల్లి మురళీధర్, గంధం బాబ్జీ, సాయన సుబ్బారావు, అందె వెంకట నాగ భూషణం, మణి చౌదరి, పిల్ల సుబ్బారెడ్డి, పెద్ది రెడ్డి సుబ్బారావు, చిన్నం మురళీ కృష్ణ, జ్యేష్ట సతీశ్, మట్టపర్తి రామ్ మోహనరావు, బర్రె వెంకట రమణ, ,అరిగెల శ్రీనివాస్, పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ఆర్థికసాయం

విశాలాంధ్ర -గోకవరం : తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన పొట్నూరి సతీష్ కుమారుడు రెండు సంవత్సరాల అక్షయ్ రామ్ అనారోగ్యంతో తమిళనాడు వేలూరు ఆసుపత్రిలో బోన్ మ్యారో వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఆ చిన్నారి పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని మాజీ జడ్పిటిసి పాలూరు బోసుబాబు దాతలకు పిలుపునిచ్చారు. పార్టీలు, కులమతాలకతీతంగా సేవా దృక్పథంతో చిన్నారి కోసం చేస్తున్న సేవలు ఎనలేనివని బోసుబాబును పలువురుకొనియాడుతున్నారు. ఆ చిన్నారి కి ప్రెస్ క్లబ్ తరఫున సాయం అందించాలని తీర్మానించారు. ఆ చిన్నారికి ప్రెస్‌క్లబ్ సభ్యుల తరపున పదివేల రూపాయల ఆర్థికసహాయాన్ని వారికుటుంబ సభ్యులకు అందజేశారు.

పరీక్షల నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు

కలెక్టరు మాధవీలత

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : శనివారం అమరావతి నుంచి విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎస్.ఎస్. సి, ఇంటర్ మీడియట్ పరీక్షల నిర్వాహణా ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టరు మాధవీలత అనుబంధ శాఖల అధికారులతో కలసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ కె. మాధవీలత అధికారులతో సమీక్షిస్తూ జిల్లాలో ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షలు -2023 ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు నిర్వహించనున్నారని, పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 126 పరీక్ష కేంద్రాల్లో 26,129 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. అందులో బి క్యాటగిరిలో 98 కేంద్రాలు, సి క్యాటగిరిలో 28 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయన్నారు. ఇందులో ఎస్ ఎస్ సీ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు బాలురు 11477 మంది, బాలికలు 11255 మంది మొత్తం 22732 మంది, ప్రయివేట్ విద్యార్థులు బాలురు 2041 మంది, బాలికలు 1356 మొత్తం 3397 మంది కాగా వెరసి మొత్తం 26,126 మంది పరీక్షలు వ్రాసేందుకు హాజరు కానున్నారని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా ఏప్రిల్ 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయన్నారు.

ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్ష హాల్లోకి ఏ విధమైన సెల్ ఫోన్ లు తీసుకు రాకుండా చూడాలని, సిబ్బంది కూడా ఎవరు సెల్ ఫోన్ తీసుకురాకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అడిషినల్ ఎస్పీ ఎం.రజనీ , ఆర్ఐఓ ఏఎల్ ఎన్ నరశింహరావు, ఆర్జేడీ ఐ. శారద, ఏవిఎస్ సుబ్రహ్మణ్యం, డిఈఓ ఎస్. అబ్రహం, డి.వి.ఈ ఓ, జె. వి. ఎస్. ఎస్. సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తును కాపాడేందుకు యువత, ఉద్యోగులు సహకరించాలి

-చంద్రబాబు జూమ్ మీటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర - రావులపాలెం : దేశానికి వెన్నెముక లాంటి యువత, న్యాయాన్ని కాపాడే న్యాయవాదులు, ప్రాణం పోసే డాక్టర్లు, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే ఉపాధ్యాయులు తదితర ఉద్యోగులు ప్రస్తుత రాష్ట్రంలోని పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రాన్ని కాపాడేందుకు తమవంతు సహకారం అందించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కొత్తపేట నియోజకవర్గ ఇన్చార్జి బండారు సత్యానందరావు కోరారు. నిరుద్యోగ యువత, లాయర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులతో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శనివారం జూమ్ యాప్ ద్వారా నిర్వహించిన వర్చువల్ సమావేశంలో భాగంగా రావులపాలెం కాపు కళ్యాణ మండపంలో బండారు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. చంద్రబాబు ప్రసంగాన్ని భారీ స్క్రీన్ పై తిలకించారు. ఈ సందర్భంగా బండారు చంద్రబాబుతో వర్చువల్‌గా మాట్లాడారు. జగన్ ప్రభుత్వం పంచాయతీలు, స్థానిక సంస్థలను పూర్తిగా దివాలా తీయించి కరెంటు బిల్లులు కూడా కట్టలేని పరిస్థితికి తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు ఇచ్చిన సలహాలను, సూచనలను పాటించి రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్ది, సమస్యలతో సతమతమవుతున్న ప్రజలను కాపాడే యాగంలో యువత, ఉద్యోగులు పాలుపంచుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చిలువూరి సతీష్ రాజు, గుత్తుల పట్టాభి రామారావు, కాసా విజయసాగర్, మేడపాటి కాసురెడ్డి, బండారు సత్తిబాబు, మాసాబత్తుల ఆనందరావు, పడాల బులి కొండారెడ్డి, జక్కంపూడి వెంకటస్వామి, అధికారి నాగు, మైగాపుల గురవయ్య తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ. 21 లక్షల నష్ట పరిహారం

- అర్ధరాత్రి ఒంటిగంట వరకు ఆందోళన
- భార్యకు ఉద్యోగం, పిల్లల చదువులు భరిస్తామని వేదాంత కంపెనీ హామీ

విశాలాంధ్ర - అమలాపురం : ఉప్పలగుప్తం మండలం ఎస్ యానం వేదాంత యాజమాన్య వేధింపుల వలన మృతి చెందిన కార్మికుడు పెట్టా రామకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ప్రజా సంఘాల చేస్తున్న ఆందోళన శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట వరకు జరిగింది. మధ్యాహ్నం ఒంటిగంట నుండి న్యాయం కోసం చేస్తున్న ఆందోళనకు వేదాంత యాజమాన్యం ఎంతకీ స్పందించకపోవడంతో యాజమాన్యం వైఖరికి నిరసనగా రామకృష్ణ మృతదేహాన్ని రవ్వ ప్లాంట్ లోపలికి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నం చేయగా పోలీసులకు, ఆందోళనకారులకు తోపులాట జరిగింది. వేదంత యాజమాన్యం స్పందించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించడంతో చివరకు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్, రెవిన్యూ అధికారులు జోక్యం చేసుకొని వేదాంత యాజమాన్యంతో మాట్లాడటంతో వేదాంత అధికారులు దిగివచ్చి ఉప్పలగుప్తం మండలం తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి ద్వారా మృతుడు కుటుంబానికి వేదాంత యాజమాన్యం తరఫున 15 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ రూపంలో 6 లక్షల రూపాయలు, రామకృష్ణ భార్యకు వేదాంత కంపెనీలో ఉద్యోగం ఇచ్చి వారి పిల్లలకు ఉన్నత చదువులు వరకు ఉచితంగా విద్యను అందిస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరొక ప్రధాన డిమాండ్ అయిన మృతుడు రామకృష్ణ లాగా గతంలో తొలగించిన ఐదుగురు కార్మికులను తక్షణ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేయగా 10 రోజులలో తొలగించిన కార్మికులను తిరిగి తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి విశ్వరూప్ చరవాణిలో ఆందోళనకారులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి వేదాంత యాజమాన్యం ఇచ్చిన హామీలు సకాలంలో అమలు చేయకపోతే గ్రామ ప్రజలు ప్రజా సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్లాంట్ కార్యకలాపాల అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అమలాపురం రూరల్ సీఐ వీరబాబు, ఉప్పలగుప్తం మండల ఎస్సై వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, జనసేన నాయకులు శెట్టిబత్తుల రాజబాబు,మృతుడి బంధువులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమలాపురంలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పట్టణంలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు శనివారం అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్, వైసీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బుల్లి నాని, తుని వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు ఒంటెద్దు వెంకన్న నాయుడు, యేనుముల కృష్ణ పద్మరాజు, గారపాటి చంద్రశేఖర్, నగబేరి కృష్ణమూర్తి, కంకిపాడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో ఘోరాలు-నేరాలు

అక్కడ పెత్తందారుల హవా

విశాలాంధ్ర - కాట్రేనికోన : అజ్ఞానమో లేక సాంకేతిక సమాచార విజ్ఞానమొ తెలియదు గానీ ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన లైంగిక నేరాలు నేడు పల్లెలకు పాకాయి. ప్రధానంగా సముద్ర తీర గ్రామాలలో ఇటీవల తరచూ బాలికలపై ఘోరాలు జరగుతున్నాయి. సభ్య సమాజం తలదించుకునేలా తీరంలో ఘోరాలు నేరాలు పెరిగిపోతుండడంతో ప్రతి ఒక్కరూ లోను ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రధానంగా కాట్రేనికోనమండలంలోని తీర గ్రామాలలో జరుగుతున్న సంఘటనలు ఇందుకు అద్దం పడుతున్నాయి. మొన్న చిరయానం గ్రామంలో ఒక మైనర్ బాలికపై ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన దుస్సంఘటన మర్చిపోకుండానే తాజాగా బలుసు తిప్ప గ్రామంలో మరో మైనర్ బాలికను పెళ్లి చేసుకోవడమే కాకుండా మొదటి రాత్రే ఆ బాలిక నగ్న దృశ్యాలను చిత్రీకరించిన కీచక భర్త స్వయంగా వాట్సప్ తదితర సోషల్ మీడియాలో ప్రచారం చేసిన సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపాయి. పోలీసులు నిందితులను అరెస్టు చేసి కటకటాల వెనుకకు పంపారు. అయితే ప్రశాంతంగా ఉండే తీర గ్రామాలలో లైంగిక నేరాలు జరగటం వాటి ప్రభావం బయట సమాజంలో భయాన్ని పుట్టిస్తోంది. ఒకప్పుడు కొట్లాటలు,ఘర్షణలకు చిరునామాగా పేరు పొందిన సముద్ర తీర గ్రామాల్లో ఇటీవల కాలంలో కొంతమేర ప్రశాంతత నెలకొందని చెప్పుకోవచ్చు. కాట్రేనికోనపోలీస్ స్టేషన్, ముమ్మిడివరం మేజిస్ట్రేట్ కోర్టు గతరికార్డులు చూస్తే సముద్ర తీర గ్రామాల్లోని మత్స్యకారుల మధ్య కేసులే ఎక్కువ. స్థానిక శాసనసభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ కృషి, పోలీసు అధికారుల చర్యలు, స్థానిక పెద్దల్లో వచ్చిన మార్పు అయితేనేమి ఇటీవల కాలంలో గొడవలు తగ్గి పోలీసు కేసులూ తగ్గాయి. ఎమ్మెల్యేగా గెలిచిన సతీష్ తొలినాళ్లలోనే తీర గ్రామాలలో ఇరు వర్గాల మత్స్యకారపెద్దల మధ్య సయోధ్య కుదిర్చి కొంతమేర మార్పు తీసుకు వచ్చి సఫలీకృతులయ్యారనే చెప్పాలి. యువత మాత్రం కొత్త విష సంస్కృతితో మైనర్ బాలికలు, యువతులపై ఆకృత్యాలకు పాల్పడుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. నిరక్షరాస్యతతో పాటుగా మండలంలో పల్లం, బలుసు తిప్ప, పోర, మొల్లేటిమొగ, కొత్తపాలెం, నీళ్ల రేవు, చిర యానం, గచ్చకాయల పోర తదితర సముద్ర తీర గ్రామాలలో నేటికీ పెత్తందారీ వ్యవస్థ పెత్తనం సాగిస్తోంది. ముఠా నాయకులదే పై చేయి. ఇక్కడ పోలీసు వ్యవస్థ నామ మాత్రమే. తీర గ్రామాల్లో మహిళా పోలీసులు చూడడం తప్ప వారు చేయగలిగింది ఏమీ లేదు. ఇందుకు ఇటీవల చిరయానంలో జరిగిన అత్యాచార సంఘటనే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఒక విధంగా ఇక్కడ పోటీ ప్రభుత్వం నడుస్తుందంటే అతిశయోక్తి కాదు. పెత్తందారులు చెప్పిందే వేదం. లేకుంటే జరిమానాలు, గ్రామ బహిష్క రణలు తప్పవు. గ్రామాల్లో జరిగిన సంఘటనలు బయట ప్రపంచానికి తెలియ కుండా ఉండడానికి ఒక్కోసారి ఇరువర్గాల మత్స్యకా రులు ఏకమై పోతూ ఉంటారు. చిన్న చిన్న సంఘటనలు పెద్దల సమక్షంలో పరిష్కరించు కోవడం సహజమే. కానీ తీవ్ర నేరాలు కూడా కప్పి పెడుతూ ఉండడంతో అవి పెద్ద సమస్యలు అవుతున్నాయి. జరిమానాలు విధించి కేసులకు వెళ్లకుండా సరిపెడతారు. సామాన్య ప్రజలు, చదువుకున్న మత్స్యకారయువత సైతం తమకుఎందుకు వచ్చిన గొడవని బయటకు చెప్పడానికి సాహసించరు. ఇక్కడ మహిళా పోలీసులు సహితం పెద్దలను కాదని చేయగలిగింది ఏమీ లేదు.ఇందుకు ఇటీవల చిర్రయానంలో జరిగిన అత్యాచార సంఘటనే నిదర్శనం. ఇక్కడ అత్యాచారం జరిగిన పది రోజులకు బయటకు వచ్చిందంటే అర్థం అవుతుంది. మత్స్యకారగ్రామాల్లో పోలీసులు వైఫల్యంమూ లేకపోలేదు. ఏదైనా సంఘటన జరిగితేనే ఉరుకులు పరుగులు మీద పోలీసులు తీరానికి చేరుకుంటారు. కానీ ముందు జాగ్రత్తచర్యలు అంతంత మాత్రమే. అప్పుడప్పుడు మత్స్యకార గ్రామాల్లో నేరాలు నిరోధించేందుకు వారిని చైతన్య పరిచేలా పోలీసు పరంగా సదస్సులు నిర్వహించడం నామ మాత్రమే. కనీసం గ్రామాల్లో గస్తీలునిర్వహించరు. నిఘా పెట్టరు. ఇక్కడ జరిగిన నేరాలకు సంబంధించి నిందితులను అరెస్టు చేయాలంటే పోలీసులకు స్థానిక పెద్దలే అప్పచెప్పాల్సిన పరిస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ ఒకే పేరుతో చాలామంది ఉండటం పోలీసులకు సమస్యగా ఉంటుంది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా వచ్చిన సుధీర్ కుమార్ రెడ్డి కృషి ఫలితంగా ఏటా లక్షలాది రూపాయలు వేలం పాటల ద్వారా సముద్ర తీర గ్రామాలలో నిర్వహించే అక్రమ మద్యం షాపులు మూతపడ్డాయి. అక్రమ వ్యాపారులను అరెస్టు చేసి కటకటాలకు పంపడంతో వారు బేజారెత్తిపోయారు. సెటిల్మెంట్లు పేరుతో రోజు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగే దళారులు కంగు తిన్నారు. నేరస్తులకుపోలీస్ అంటే భయపడే స్థాయికి తీసుకు వచ్చారు కొత్త ఎస్పీ. ఇటీవల కాలంలో మత్స్యకారకుటుంబాల పిల్లలు చదువుకుని విద్యావంతులు కావడంతో వారిలోను చైతన్యం కొట్ట వస్తోంది. ఇప్పటికే యువకులు పలు సమస్యలపై పెత్తందారులను సైతం నిలదీసి ప్రశ్నిస్తున్నారు. రానున్న రోజుల్లో తీరంలో పెత్తందారీ వ్యవస్థకు, పెత్తనానికి స్వస్తి పలికి గ్రామాల్లో శాంతి భద్రతలు అదుపులో ఉండిఅభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరగాలని సర్వత్రా కోరుతున్నారు.

ఓ పక్క ఆక్రమణలు..మరోపక్క నీటి వృథా

-పట్టించుకోని నగరపాలక యంత్రాంగం

విశాలాంధ్ర - కాకినాడ : నగరంలో రోజురోజుకు ప్రభుత్వ స్థలాలన్ని దురాక్రమణలకు గురవుతున్నాయి. ఆ కోవలోకే కాకినాడ సినిమారోడ్డు సమీపంలో కల్పనా సెంటర్ ఆర్వోబీ నిలుస్తుంది. ఈ వంతెన క్రింద ఏళ్ల తరబడి దురాక్రమణలు కొనసాగుతున్నా ఈ స్థలం మనకు సంబంధం లేనట్టుగా నగరపాలకసంస్థ అధికారులు ప్రవర్తిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయానికి అత్యంత సమీపంలో వుండే సాంబమూర్తి నగర్ ఆర్వోబీ నగరపాలకసంస్థకు సంబంధం లేదని దీనిపై కేవలం ఆర్డీవో స్థాయి అధికారులే చర్యలు తీసుకోవాలని నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళికవిభాగం అధికారులు చెబుతున్నారు. స్థలం ఎవరిదైనప్పటికీ ఆక్రమణలు మాత్రం మామూలే. సత్యప్రసన్ననగర్‌లో రోటరీబ్లడ్‌బ్యాంక్ ఉండడంతో నిత్యం అనేకమంది రక్తం కోసం ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడ దాదాపు ఆర్నెల్లుగా నగరపాలకసంస్థకు నీటిసరఫరా చేసే కాంట్రాక్టర్‌కు చెందిన ట్రాక్టర్ ఆర్వోబీకి ఇరువైపులా రోడ్లకు అడ్డంగా నిలిపివుంచడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఉదయం వేళ నీటి సరఫరా చేస్తూ సాయంత్రం నుంచి మాత్రం నీటిని వృధాచేస్తుండడం కొసమెరుపు. రోడ్లపై ఆక్రమణలు చేసే వ్యాపారులపై ఉక్కుపాదం మోపే ట్రాఫిక్ పోలీసులకు ఈ ప్రాంతంలో జరిగే ఆక్రమణలు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. సాంబమూర్తినగర్ ఆర్వోబీ ప్రాంతాన్ని కొందరు ట్రాక్టర్లు, కార్లు రిపేర్లు చేసే ప్రాంతంగా ఆక్రమిస్తుంటే, కొందరు పలుకుబడితో చెత్తతరలించే ట్రాక్టర్లు, టాంకర్లు నిలిపే స్థలంగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రతినిత్యం చెత్త సేకరణలపై దృష్టిసారిస్తున్న అధికారులు ఇప్పటికైనా ఆక్రమణలపై దృష్టిసారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాడపల్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కలెక్టర్

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వాడపల్లిలో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామిని జిల్లా కలెక్టర్ మాధవీలత దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, అర్చకులు కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం పూజారులు సమక్షంలో అర్చన చేసి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. మాధవీలత మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని కోరుకున్నానని అన్నారు.

ఉగాదికి అనుకున్న లక్ష్యం చేరేనా?

విశాలాంధ్ర - సీతానగరం : ఉగాదికి అనుకున్న లక్ష్యం చేరేనా? అని పలువురు ప్రశ్నించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరు పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి ఆ స్థలాలలో ఇళ్ల నిర్మాణాలు చేయాలని లబ్దిదారులను ఆదేశించారు. దీనిలో మండలంలో వంగలపూడి, కాటవరం, ఇనుగంటివా రిపేట, చినకొండేపూడి, మిర్తిపాడు, రామచంద్రపురం మొదలగు గ్రామాలలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి లబ్దిదారులకు స్థలాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ కేటాయించిన లే అవుట్‌లలో కొన్నింటికి కనీస సౌకర్యాలను అధికారులు కల్పించలేదు. ఉగాది నాటికి మండలంలో 500 ఇళ్లు గృహ ప్రవేశాలు చేయాలనే లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరేలా లేదు అనడంలో సందేహం లేదు. దీనికి తోడు రోజు రోజుకీ పెరుగుతున్న ఇనుము, ఇటుకలు, సిమెంట్ ధరలతో ప్రభుత్వం ఇస్తున్న లోన్ సరిపోవడం లేదు అని లబ్దిదారులు వాపోతున్నారు. ఏది ఏమైనా అధికారులు పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలలో కనీస సౌకర్యాలను కల్పించి ఇస్తున్న లోన్ మొత్తం పెంచి ఇస్తే తప్పా లబ్దిదారులు పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లేరు. దీనితో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరేలా లేదు అనడంలో అతిశయోక్తి లేదు.

టీడీపీ ప్రభుత్వం వల్లే ఆప్కో నిర్వీర్యం

విశాలాంధ్ర - అనపర్తి : తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో ఆప్కోను నిర్వీర్యం చేసి భ్రష్టు పట్టించారని అనాలోచిత నిర్ణయాలతో చేనేత అప్పుల ఊబిలో కూరుకు పోయిందని వైసీపీ ఉమ్మడి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ పెనుగొండ శ్రీను విమర్శించారు.శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మదనపల్లె లో జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పై నారా లోకేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలు తమని తీవ్ర ఆవేదనకు గురి చేసాయన్నారు. సిఎం గా జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా నేతన్న పథకం రూపకల్పన చేసి ప్రతి ఏడాది రూ.24 వేలు ఇవ్వడం జరుగుతుందని శ్రీను వివరించారు.నారా లోకేష్ చేనేత కార్మికుల పై చేసిన వ్యాఖ్యలకు తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు.గంజి చిరంజీవి కి లోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని పెనుగొండ శ్రీను డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఎంపిటిసిలు బండారు శ్రీనివాసరావు, కొండేటి భీమేష్,తుమ్మల సత్తి బాబు తదితరులు ఉన్నారు.

ప్రజారంజక పాలనను ప్రజలకు వివరించాలి



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న వార్డు, గ్రామ వాలంటీర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు వారధిగా ఏర్పాటైన గృహసారథులు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళతారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు,రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరం మండలం దివాన్ చెరువు ఎం.ఎఫ్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం జరిగిన రాజానగరం మండల సచివాలయ కన్వీనర్లు,గృహ సారథుల అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. రాజానగరం మండల సచివాలయ కమిటీ అధ్యక్షులు గా అడబాల జగదీష్ పేరును సభాముఖంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రకటించార. ప్రతి 50-60 ఇళ్లకు ఒకరిని సారధిగా నియమించి, పార్టీకి, ప్రజలకు మధ్య సారధులుగా వ్యవహరించేలా తీర్చిదిద్దుతు న్నామని వివరించారు.ఈ రెండు వ్యవస్థలూ కలిసి ప్రజలకు మరింత మచి చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్దవెంకన్న, మండలకన్వీనర్ దూలం పెద్ద, మందారపు వీర్రాజు,కో- కన్వీనర్ గండి నాని బాబు,మండల సర్పంచ్ సమైక్య అధ్యక్షులు కోలపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల మాక్ పోలింగ్

విశాలాంధ్ర - భీమడోలు : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భీమడోలు విసి కన్వెన్షన్ హాల్ వద్ద ఎమ్మెల్సీ ఎన్నికల మాక్ పోలింగ్ కార్యక్రమం ఎమ్మెల్సీ అభ్యర్థి వంక రవీంద్రతో కలిసి ఉంగుటూరు ఎంఎల్ఏ వాసుబాబు అవగాహన సదస్సు నిర్వహించారు.ప్రాధాన్యత ఓటింగ్ విధానంపై స్థానిక ప్రజా ప్రతినిధులైన ఎంపీటీసీ, జడ్పీటీసీ లకు అవగాహన కల్పిస్తూ మాక్ వోటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి జగన్ సరికొత్త ఒరవడికి నాంది పలికారని కొనియాడారు. నామినేటెడ్, పార్టీ, అధికారిక పదవుల్లోనూ అన్ని సామాజిక వర్గాలకి ప్రాతినిధ్యం కల్పించాలని తెలిపారు. ఈ నేపథ్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

మహిళలను చైతన్యపరచిన సావిత్రిబాయిపూలే

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : భారతదేశంలో మహిళలు చైతన్య వంతులు కావడానికి గల కారణం సావిత్రిబాయి పూలే అని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వెలగల దుర్గారావు పేర్కొన్నారు. స్థానిక బీసీ కార్యాలయం వద్ద సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి కార్యక్రమం బీసీ నాయకుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ భారతదేశంలో సావిత్రిబాయి పూలే మొదటి ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా, మహిళలను చైతన్యవంత పరచడంలో ఆమె చేసిన కృషి మరువలేనిదని ఆయన అన్నారు. చట్టసభలలో మహిళలకు 50 శాతం సీట్లు ఇచ్చే సాధనా దిశగా ముందడుగు వేయాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మహిళలు పార్టీలకు అతీతంగా మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాడి చర్ల సోమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సురవరపు గోపాల రాజు, కొయ్యలగూడెం మండల వైస్ ఎంపీపీ మట్ట వనజాక్షి, మండల బీసీ నాయకులు జవ్వాది శ్రీనివాసరావు, బూసి త్రిమూర్తులు, శెట్టి శ్రీనివాసరావు, మువ్వా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి కుర్చీల పంపిణీ

విశాలాంధ్ర-టి నరసాపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి వుండాలని పోలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గన్నిన సురేంద్ర నాథ్ చౌదరి తెలిపారు. బండి వారి గూడెం పంచాయితీలోని నాయకుల గూడెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి ఆయన సోదరుడు గన్నిన లక్ష్మణరావు సహకారంతో పిల్లలు కూర్చోవడానికి శనివారం 30 కుర్చీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాళం కాశీ, కొప్పర్తి గోపి, జోనుబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గోవుల స్వీకరణ తాత్కాలికంగా నిలిపివేత

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల :: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానం నిర్వహిస్తున్న గోశాలనందు భక్తులచే సమర్పించబడు గోవులను స్వీకరించే కార్యక్రమం తాత్కాలికంగా నిలిపివేశామని ఆలయ కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాధరావు పేర్కొన్నారు. గత కొద్ది నెలలుగా దేశవ్యాప్తంగా లంపి స్కిన్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగాబయటనుండి వచ్చే గోవులను స్వీకరించడంలేదని ఈవో తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాటు

ఆకివీడు-విశాలాంధ్ర : ఇంటర్మీడియట్ పరీక్షల్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించి విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆర్టిఓ దాసి రాజు అన్నారు. శనివారం ఈనెల 15వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు నేపథ్యంలో ఆకివీడులోని కార్తికేయ, విద్యా వికాస్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈయన వెంట వీఆర్వో దానయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

విశాలాంధ్ర-ముసునూరు: మండలంలోని గోపవరం గ్రామంలో గడ్డివాము దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్లగా ముసునూరు మండలం గోపవరం గ్రామంలో శనివారం మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు పుట్టి లక్ష్మణరావుకు చెందిన 5 ఎకరాల గడ్డివాము దగ్ధం, కాగా సుమారు 50వేలు నష్టం వాటిల్లినట్లు విఆర్ఓ శ్రీనివాస్ తెలిపారు.

వైద్య శిబిరం పరిశీలించిన ముద్దరబోయిన

విశాలాంధ్ర- ముసునూరు: మండలంలోని చక్కపల్లి గ్రామంలో కూచిపూడి లక్ష్మినారాయణ కమ్యూనిటీహాల్ వద్ద మండల టీడిపి నాయకులు కూచిపూడి దేవేంద్ర ఆధ్వర్యంలో చింతలపూడి సాయి స్ఫూర్తి హాస్పటల్ వారిచే పలువురు వైద్యులచే బి.పి,షుగర్,లాంటివి కాకుండా మరేన్నో వైద్య పరీక్షలు చేశారు. నూజివీడు నియోజక వర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సందర్శించి,గ్రామస్థులను బాగోగులను అడిగి తెలుసుకున్నారు.సర్పంచ్ తల్లిబోయిన సత్యనారాయణ,గ్రామ పార్టీ అధ్యక్షులు కాటేపల్లి ప్రసాదు,మాజీ సర్పంచ్ కాటేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలకు భంగం కలగకుండా మాస్టర్ ప్లాన్ రూపొందించండి

- జిల్లా కలెక్టర్ పి .ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: సామాన్యుల హక్కులు, ప్రయోజనాలకు ఇబ్బంది లేని విధంగా భీమవరం మాస్టర్ ప్లాన్-2041 రూపొందేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి భీమవరం మాస్టర్ ప్లాన్ -2041 డ్రాఫ్ట్ పై సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ సామాన్య ప్రజల ప్రయోజనాలకు ఇబ్బంది లేనివిధంగా రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే చిన్న, మధ్య తరహా రైతుల పంట భూములకు ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. మాస్టర్ ప్లాన్ లోనిర్దేశించిన శాతానికి గ్రీనరీ ఏర్పాటుకు వివిధ ప్రదేశాల్లో ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. నూతన మాస్టర్ ప్లాన్ లో ఉండి, దిరుసుమర్రు, గొల్లవాని తిప్ప, తోక తిప్ప, చెరుకువాడ ప్రాంతాలను కలిపి రూపొందించాలన్నారు. డ్రాఫ్ట్ ప్లాన్ పై స్వీకరించిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. రిక్రియేషనల్ ఏర్పాటుకు ఎక్కువ ప్రాంతాలు కాకుండా ఒకటి, రెండు ఎంపిక చేస్తే సరిపోతుందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి లెక్కల ప్రకారం భీమవరం మున్సిపల్ ఏరియ 25.96 స్క్వేర్ కి.మీలు, జనాభా 1.42 లక్షలు కాగా, 2020 నాటికి 48.95 స్క్వేర్ కి.మీలు, జనాభా 1.67 లక్షలుగా ఉంది. 2041 నాటికి అంచనా జనాభా 2.33 లక్షలకు అనుగుణంగా భీమవరం మాస్టర్ ప్లాన్-2041 ను రూపొందించడం జరుగుతున్నదన్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, పబ్లిక్, సెమీ పబ్లిక్, రిక్రియేషనల్, ట్రాన్స్పోర్ట్, కమ్యూనికేషన్, అగ్రికల్చర్,ప్రత్యేక ప్రాంతం, వాటర్ బాడీస్ కు శాతాలు వారీగా అభివృద్ధి ప్లాన్ ను ఏర్పాటు చేయడం జరుగుతుంద న్నారు.ఈ సమావేశంలో ఇయుడిఎ (ఏలూరు అర్బన్ డవలప్మెంట్ అథారిటీ) వైస్ చైర్మన్ డి. చంద్రశేఖర్, భీమవరం మున్సిపల్ కమిషనర్ శివ రామకృష్ణ, ఎసిపి గౌర్, రాజమహేంద్రవరం టిపిఎ వి.వి. రమణ, డిప్యూటీ సిపిఒ కె. కోటేశ్వరరావు, ఇయుడిఎ పి.ఓ ఎన్. సురేఖ, ఎపిఓ వి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు మొదటి స్థానం కైకలూరుదే :డిఎన్ఆర్

విశాలాంధ్ర -కైకలూరు : గడప గడపలో తనను మొదట స్థానంలో నిలిపిన ఘనత అక్కడ జగనన్న పిలుపు ఇక్కడ మీరిచ్చిన ప్రోత్సాహాలకే దక్కుతుందని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు కైకలూరు మండల వైసీపీ శ్రేణులు,అధికారులను ఉద్దేశించి అన్నారు.ముందుగా మండలం లోని ఆలపాడు గ్రామంలో గడప గడపను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఆరాతీస్తూ ముందుకు కదిలారు.అనంతరం కైకలూరు మండలంలో విజయవంతం గా ఈరోజు తో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగుస్తున్న సందర్భంలో ఆలపాడులో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈరోజుతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగుస్తున్న సందర్భంలో ఇంత పెద్ద ఎత్తున విజయోత్సవ సభను సంకల్పించి నిర్వహిస్తున్న గ్రామ వైసీపీ శ్రేణులను అభినందిస్తున్నానని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎంపిపి అడివి వెంకట కృష్ణ మోహన్ స్వాగత పన్యాసం చేయగా మండల వైకాపా అధ్యక్షులు బత్రాజు శివాజీ, జడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మడి వెంకటేశ్వరరావు,రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య,మండల వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్,ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ,రాష్ట్ర వడ్డీలు కార్పొరేషన్ చైర్పర్సన్ సైదు గాయత్రీ సంతోషి సభను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఆత్మీయ అతిథిగా విచ్చేసిన పూర్వ శాసనసభ్యులు జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ గతంలో తాను పనిచేసిన పార్టీ తనకు ఇచ్చిన అవకాశాలు చేయించిన ఖర్చులు, గురిచేసిన అవమానాలు మాట ఇచ్చి మోసం చేసిన విధానం గుర్తుచేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ దంపతులు కొప్పుల కృష్ణకుమారి-కొప్పుల ఏడుకొండలులను గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకట రమణలు వైసీపీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

13వ తేదీ స్పందన రద్దు

విశాలాంధ్ర-భీమవరం: స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా ఈ నెల13న సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు నిర్వహించబడు జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం రద్దు చేయబడినదని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' కార్యక్రమం రద్దు చేసినట్టు కలెక్టర్ ఆ ప్రకటన లో తెలిపారు.

ప్రజలపై జగన్ ప్రభుత్వం మరో బాదుడుకు సిద్ధం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఇప్పటికే తుగ్లక్ నిర్ణయాల వల్ల సతమతమవుతున్న ప్రజలపై జగన్ సర్కార్ మరో బాదుడుకు సిద్ధమవుతోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జగన్ సర్కార్ ప్రజలపై పన్నుల మోత మోగించడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. పట్టణాల్లో ప్రతి ఏటా ఆస్తి పన్ను 15 శాతం పెంచాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించుకుందని దీనిలో భాగంగానే ఏప్రిల్ నుంచి కొత్త బాదుడు బాదేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని అన్నారు. ప్రజలను ఏమార్చి ఈసారి చెత్త పన్నును కూడా ఆస్తి పన్నులో కలిపేందుకు ప్రభుత్వం సిద్ధవుతోందన్నారు. ఇది జనంపై మరింత భారం మోపడమేనని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఏపీలోని పట్టణాలు, వైజాగ్ మహా నగరంలో ఆస్తులున్నవారికి భారీగా పన్నులు వడ్డిస్తున్నారని, దీనికి తోడు అదనంగా చెత్తపన్ను వేసి నడ్డివిరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆదిరెడ్డి అప్పారావు డిమాండ్ చేశారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో 74 మంది ఓటర్లు

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13న జరుగుతుండగా ఉంగుటూరు నియోజకవర్గం నుండి 74 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉంగుటూరు నియోజవర్గంలో నాలుగు మండలాలు ఉన్నాయి. మండలాలు వారీగా ఉంగుటూరు 24 మంది, గణపవరం 20 మంది, నిడమర్రు 15 మంది, భీమడోలు 20 మంది జడ్పిటిసి, ఎంపిటిసిలతో సహా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే వైసీపీ, టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థులకు జోరుగా ప్రచారం చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: అక్రమంగా తరలిస్తున్న తెలంగాణకు చెందిన రేషన్ బియ్యాన్ని శనివారం నూజివీడు మండలంలో సీజ్ చేసినట్లు విజిలెన్స్ సిఐ శివరామకృష్ణ తెలిపారు . రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి గొల్లపల్లి వద్ద రెండు లారీల్లో తరలి వెళుతున్న 43 టన్నుల నూకలు చేసిన రేషన్ బియ్యం కనుగొని లారీలతో సహా సరుకును సీజ్ చేసినట్టు విజిలెన్స్ సిఐ తెలిపారు. దాడుల్లో పిడిఎస్ డిటి వెంకటేశ్వరరావు, వీఆర్వో వీరయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ : ఇద్దరి మృతి

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: విజయవాడ రూరల్ నున్న రోడ్డులో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమం ఉంది. బావాజీ పేటకు చెందిన శేషపు రవి(36), లూనా సెంటర్ సింగ్‌నగర్‌కు చెందిన దేవర్ల నాగరాజు(32) మృతి చెందగా, సింగ్‌నగర్‌కు చెందిన షేక్ యూసఫ్ బాషా(34) ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ముగ్గురు స్నేహితులు కలిసి నగరంలో టైల్స్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. భోజనం కోసం కండ్రిక నుండి నున్న గ్రామం పైపు ద్విచక్రవాహం పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సత్యనారాయణ సమాధుల వద్దకు వచ్చేసరికి విజయవాడ నుండి విస్సనపేటకు వెళ్లే ఆర్టీసీ బస్సు వాహనాన్ని ఢీకొన్న ఘటనలో రవి అక్కడికక్కడే మృతి చెందగా, నాగరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

చాగల్లులో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం

విశాలాంధ్ర - చాగల్లు : మండల కేంద్రం చాగల్లు మండల ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం శనివారం చాగల్లు లోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ రీడింగ్ భవనంలో రిటైర్డ్ ఎంఇఓ కె ఎస్ ఎన్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు డి. నాగేశ్వరరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సంఘం బలోపేతం చేసుకోవాలని కోరారు. సంఘ సభ్యుల పుట్టిన రోజు వేడుకలను కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సభ్యుల జీతాల ఖాతాకి ఆధార్ అనుసంధానం వివరాలు తదితర అంశాలను చర్చడం జరుగింది.కార్యక్రమం లో సంఘం ఉపాధ్యక్షులు దేగల నాగేశ్వరరావు, కోశాధికారి ఆత్కూరి రామారావు, పి అనిల్ కుమార్, వి. గంగాధర్ బి. వెంకటరత్నం, జి. డేనియల్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ఆహార పదార్థాల తనిఖీ

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రాష్ట్ర ఎన్‌జేపీ పార్టీ అధ్యక్షులు కడియం సూరిబాబు, ఎన్ జేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపు మేరకు అమలాపురం మద్దాలారిపేటలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహము నెంబర్ 3 అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆహార తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు, రొంపలు, దగ్గులు, గురించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యపై అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుసుమ నరసింహారాజు, బొల్లోజు రాజేష్, గున్నేపల్లి భీమశంకరం, గంటి చిరంజీవి, జి. శ్రీకాంత్ వర్మ, సాదె కృష్ణ అంబేడ్కర్, సిర ప్రేమ్ కుమార్, గిద్దల సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీకి పాలించే అర్హత లేదు

విశాలాంధ్ర - నిడదవోలు : వైసీపీ పాలనలో పరిశ్రమలు రాక యువత ఉపాధి కోల్పోతోందని, నిరుద్యోగ భృతి ఇస్తానన్న ఎన్నికలహామిని అమలు చేయని వైసీపీకి రాష్ట్రాన్ని పాలించే హక్కులేదని నిడదవోలు పట్టణ టీడీపి అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు.నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నిడదవోలు పట్టణ 15వ వార్డ్ గాంధీ నగర్‌లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ ఆకుతోట సతీష్, యూనిట్ ఇంచార్జు షేక్ కరీం, రామదాసు, దొడ్డి రామారావు, కేదార శెట్టి వెంకటేశ్వరరావు, చెట్టే సాల్మన్ రాజు, విజయ్ కుమార్, గారపాటి సూర్యకాంతం, వీరాంజనేయ చౌదరి, కోలా సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర- కంచికచర్ల: మండలం లోని కీసర గ్రామంలో అంగన్వాడీ ప్రీ ప్రైమరీ స్కూలు ను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శనివారం పరిశీలించి - సిబ్బందితో మాట్లాడి, పిల్లలతో ముచ్చటించారు, అనంతరం గ్రామ సచివాలయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు- పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అంగన్వాడీల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, అంగన్వాడీలకు శాశ్వత భవనాలను నిర్మించడానికి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు బాలింతల -శిశువుల సంక్షేమం కోసం వారికి పౌష్టికాహారం అందజేయడం కోసం పెద్ద ఎత్తున ప్రభుత్వ ఖర్చు పెడుతుంది అని గుర్తు చేశారు.

గ్రామ సచివాలయం -రైతు భరోసా కేంద్రం -వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలకు -ఆలోచనలు అనుగుణంగా పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధుల పని చేయాలన్నారు, త్వరలోనే ప్రభుత్వం పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తుందని చెప్పారు, అనంతరం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ప్రత్యేకంగా చర్చించారు, గ్రామంలో డ్రైనేజీల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా పై చర్యలు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేరం నర్సమ్మ, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి రమేష్, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఉప సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ స్వామి, నాయకులు పరిటాల రామ కోటేశ్వరరావు, వెలగలేటి బాబు, దావీదు తదితరులు పాల్గొన్నారు.

పక్షుల పునరావాసానికై కోరమండల్ సంస్థ కృషి

విశాలాంధ్ర-కాకినాడ: వ్యవసాయానికి సంబంధించిన సమస్యలన్నింటికి సమగ్రమైన పరిష్కారాల తో పాటు వివిధ రకాలైన నాణ్యమైన ఉత్పత్తులు సేవలను అందించే భారతదేశపు అతిపెద్ద అగ్రి సాల్యూషన్స్ కంపెనీ, మురుగప్ప గ్రూప్‌కు చెందిన కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ పక్షులు పునరావాసానికి విశేష కృషి చేస్తుంది. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కి గ్రూప్‌కి చెందిన 686 ఎకరాల్లో 100 ఎకరాల భూమి నీటి వనరుల కిందికి, 383 ఎకరాల భూమి గ్రీన్ బెల్ట్ కిందికి వస్తాయి.కాకినాడలో పక్షుల కోసం పునరావాసాన్ని గ్రూప్ ప్రారంభించింది, ఇది కోరమండల్ పక్షుల స్వర్గధామంగా ప్రసిద్ధి చెందింది. 2011లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా వేల సంఖ్యలో పక్షులను కాపాడడం జరిగింది. 2013 మరియు 2014లో వరుసగా వచ్చిన ఫైలిన్, హుద్‌హుద్ తుపాన్ల లాంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా కూడా సమర్థవంతమైన చర్యలను బృందం చేపట్టింది. బృందం సుమారు 700 పక్షులను కాపాడింది, అవి మళ్ళీ ఎగరగలిగే వరకూ ఆశ్రయాన్నీ, వైద్య సదుపాయాలనూ వారు కల్పించారు. పక్షులు ఆహారం తీసుకోవడానికీ, సంతానోత్పత్తికి ఒక చక్కని ఆవాసాన్ని సమకూర్చింది.

విద్యార్థి మృతికి కారణమైన పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏఐఎస్ఎఫ్ బృందం

విశాలాంధ్ర-విజయవాడ : కృష్ణాజిల్లా వైఎస్సార్ తాడిగడప మున్సిపల్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో యాజమాన్యం పూర్తిగా వైఫల్యం చెందారని, ఫీజుల వసూళ్లలో ఉన్న శ్రద్ధ విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై ఏ మాత్రం లేదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షులు మందగళ్ళ సాయికుమార్ ఆరోపించారు. రెండు రోజుల క్రితం స్థానిక శ్రీ చైతన్య పాఠశాల కానూరు ఐపీఎల్, ఎంపీఎల్ క్యాంపస్‌లో 10వ తరగతి విద్యార్థి ఎం.జస్వంత్ శ్రీ సాయి విద్యుదాఘాతంతో మరణించిన ఘటనా స్థలాన్ని శనివారం విద్యార్థి యువజన సంఘాల నాయకులు పరిశీలించారు. దీనిపై స్పెషల్ కమిటీ నియమించి సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మందగళ్ళ సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థి జస్వంత్ మరణానికి కేవలం యాజమాన్యం నిర్లక్ష్యమేనని అర్థం అవుతుందన్నారు. భవనానికి బయటి వైపు పెట్టాల్సిన ఏసీ అవుట్‌లెట్స్ లోపలి వైపు పెట్టారనీ, అక్కడ పిల్లలు బట్టలు ఆరబెట్టుకోవడానికి తాడు కట్టి బట్టలు ఆరబెట్టుకుంటున్నారనీ కనీసం వసతులు కల్పించటంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించి, బట్టల ఆరబెట్టుకోవడానికి ప్రత్యేక స్థలం కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారులు సమగ్ర విచారణ జరిపించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన విద్యార్థి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ ఘటనలో బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి అయ్యప్ప, యువజన సమాఖ్య అధ్యక్షులు లంక గోవింద రాజులు , ఉపాధ్యక్షులు లంకె సాయి తదితరులు ఉన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జనసేన పార్టీ పదవ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆవిర్భావ సభకు ఏర్పాట్లు పూర్తి కావచ్చాయని ఈ సభకు మచిలీపట్నం, పెడన,అవనిగడ్డ,పామర్రు, గుడివాడ నుండి అత్యధిక సంఖ్యలో పార్టీ నాయకులు ,కార్యకర్తలు,వీర మహిళలు,అభిమానులు పాల్గొంటారని అంతే కాకుండా వివిధ జిల్లాల నుండి వచ్చే పార్టీ అభిమానులు సుమారు ఐదు లక్షల వరకు వుంటారని తెలిపారు.సభకు వచ్చే వారి కోసం 20 స్టాళ్ళ లో భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని అలాగే స్నాక్స్, పుచ్చకాయ ముక్కలు,ఐదు లక్షల వాటర్ పాకెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మధ్యాహ్నం మంగళగిరి పార్టీ కార్యాలయం నుండి వారాహి వాహనంలో రోడ్డు మార్గాన సాయంత్రానికి మచిలీపట్నం చేరుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి, నరసాపురం కన్వీనర్లు కిరణ్ రాయల్, రసూల్, వంపుగడల చౌదరి, గల్లా తిమోతీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలలు సైబర్ ప్రమాదంపై
అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : బాలలు సరైన అవగాహన లేక ప్రమాదం అంచున ఉంటున్నారని వారిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఆర్.ఎస్.ఆర్.సిహెచ్.మూర్తి తెలిపారు. శనివారం హనుమాన్‌పేటలోని టివి భవన్‌లో చైల్డ్ లైన్-1098, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ వారు సంయుక్త నిర్వహణలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సహకారంతో సైబర్ క్రైమ్ అవగాహనా,ఆన్‌లైన్ సెఫ్టి ఫర్ చిల్డ్రన్స్ అనే అంశంపై వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అవగాహన లేక చాలా మంది బాలలు ఫోన్, కంప్యూటర్, నెట్ వాడకం అవగాహన చైతన్యం లేకపోవడం వల్ల సైబర్ ప్రమాదం అంచున పడుతున్నారన్నారు. చైల్డ్‌లైన్-1098 టీం వారు ఈ సైబర్ నేరాలపట్ల, ఆన్‌లైన్ సేఫ్టీ పట్ల అవగాహన పెంచుకుని బాలలకు-యువతకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలు 27 రకాలు ప్రస్తుతం ఉన్నాయని అపరిచుతులతో, అపరిచిత యాప్స్‌తో, ఈ మెయిల్ తో ఓటిపిలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్దలకు - తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని, ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ సమాజ పటిష్టతకు మూలం అన్నారు. అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయకుడదని జరుగతున్న నేరాలకు 99% కారణాలు స్మార్ట్ ఫోన్ అని పిల్లలు ఫోన్ -నెట్ వాడకం పై తల్లిదండ్రులు అజమాయిషీ-నిఘా ఉండాలని పాస్వర్డ్ లాక్ మార్చాలని అన్నాను. ఆన్‌లైన్ సైబర్ మోసాల వల్ల చాలా మంది జీవితాలను కోల్పోతున్నారని, ముఖ్యంగా బాలలు ఆన్ లైన్ గేమ్ ఇతర యాప్స్ వల్ల వారికి తెలియకుండానే ప్రమాదంలో పడిపోతున్నారని వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ పి.నాగరాజు, వర ప్రసాద్,కె. ప్రకాష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.